క్లుప్తంగా

కలెక్టర్ ఆదేశాలతో 24 గంటల్లో ట్రై వీలర్ అందజేత

అవనిగడ్డ: కలెక్టర్ డీకే బాలాజీకి సమస్య చెప్పుకున్న 24 గంటల్లో దివ్యాంగునికి ట్రై వీలర్ అందించారు. స్వతంత్రపురానికి చెందిన నిడుమోలు సుబ్బారావు అనే దివ్యాంగుడు తను పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ బాలాజీకి విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ వెంటనే ట్రై వీలర్ ఏర్పాటు చేయమని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వాడరేవు కామరాజుని ఆదేశించారు. దీంతో రూ.90 వేలు విలువగల ట్రైవీలర్‌ని ఏర్పాటు చేయగా, స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యుడు బుద్ధప్రసాద్ చేతుల మీదుగా సుబ్బారావుకు అందించారు.

పరీక్షలంటే ఆందోళన వద్దు

మచిలీపట్నంటౌన్: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేయడానికే పరీక్షలు నిర్వహిస్తారని దీనిపై ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని సైకాలజిస్ట్ డాక్టర్ బి.రమేష్ తెలిపారు. స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో శనివారం పరీక్షల ఒత్తిడి నిర్వహణ, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి అనే అంశాల పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులు అనుకూల దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ మహ్మద్ అసిఫ్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహనా సదస్సులో పీజీటీలు కిషోర్ కుమార్ గుప్తా, బి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా నగదు అందజేత

కోనేరుసెంటర్: ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై మరణించిన సూరగాని సుబ్రహ్మణ్యం కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా సొమ్మును శనివారం ఆయన కుటుంబానికి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా గోపు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రమాదంలో మరణించిన సుబ్రహ్మణ్యం కుటుంబానికి బీమా సొమ్మును విడుదల చేసి ఆదుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో పేదలకు అన్నదానం

నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో 50 మంది అనాథ వృద్ధులు, దివ్యాంగులైన నిరుపేదలకు నిత్య అన్నదాన సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం దాతల ఆర్థిక సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. నెలకో పర్యాయం అన్నదానం జరిపే రిటైర్డ్ టీచర్స్ తుంగల శ్రీరామమూర్తి, ఉషారాణి దంపతులు ఆర్థిక సౌజన్యంతో యూఎస్ఏలో ఉంటున్న మనుమరాలు శ్రేష్ఠ పుట్టినరోజు పురస్కరించుకుని ఈ అన్నప్రసాద వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు పొన్నపల్లి చిన్నా, లంకమ్మ, సబ్బినేని రాణి, మత్తి శేషుబాబు, ఆకురాతి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా అనూహ్య

గూడూరు: ఎంపీడీవోగా టి.అనూహ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల ఎంపీడీవోగా పనిచేస్తున్న అనూహ్య గత ఆగస్టు నుంచి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. సెలవు ముగించుకుని తిరిగి విధుల్లో చేరిన అనూహ్యను గూడూరులో నియమిస్తూ జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

గూడూరు: కృత్తివెన్ను మండలం సంగమూడిలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సబ్‌జోన్ ఆటల పోటీల్లో రాయవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు సత్తా చాటారు. బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో బరిలోకి దిగిన రాయవరం జెడ్పీ హైస్కూలు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నందం మల్లీశ్వరి రవికిరణ్, హెచ్ఎం ఎం.ఎం.సౌజన్యకుమారి, ఎస్ఎంసి చైర్మన్ పామర్తి రాధాకృష్ణ మూర్తి, పీడీ గోవిందరాజులు, భట్టి భావన్నారాయణ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

కృత్తివెన్ను: గత రెండు రోజులుగా సంగమూడి హైస్కూల్ వద్ద జరుగుతున్న నియోజకవర్గ సబ్‌జోన్ పోటీల్లో మండలంలోని రాళ్లరేవు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్ఎం చంద్రమోహన్ తెలిపారు. సీనియర్ విభాగంలో టెన్నీకాయిట్ ప్రథమస్థానం, చెస్, షటిల్ బ్యాట్మింటన్‌లలో ద్వితీయస్థానం, జూనియర్ విభాగంలో టెన్నీకాయిట్, సాఫ్ట్‌బాల్‌లలో ప్రథమ, త్రోబాల్‌లో ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. వీరిని విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ నాగరాజును ఎస్ఎంసీ చైర్మన్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఒక లక్షా ఎనిమిది గారెలతో హనుమాన్‌కు వడల పూజ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. సుదర్శనం సీతారామ్, శ్రీహనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది సనకా రఘురామప్రసాద్, యర్రంశెట్టి శ్రీహరిబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

పంట కాలువ పూడ్చి రోడ్డు నిర్మాణం

- రహదారి నిర్మాణంపై రైతుల ఆగ్రహం
- సర్వే చేయించే వరకు పనులు నిలిపివేయాలని డిమాండ్
- అడ్డగోలు ఆక్రమణలు, అనధికార తూములు



రోడ్డు నిర్మాణం కోసం చినగొల్లపాలెం చానల్‌ను మట్టితో పూడ్చేస్తున్న దృశ్యం

కృత్తివెన్ను: అభివృద్ధి పేరుతో వేలాది ఎకరాలకు సాగు నీరందించే పంట కాలువను పూడ్చి రహదారి నిర్మాణం చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనులు నిలిపివేయాలని పట్టుబట్టారు. మండలంలోని గరిశపూడి వద్ద నుండి దండుదారి వరకు 5.6 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణ పనులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పీఆర్ ప్రాజెక్ట్ వర్కులో భాగంగా రూ. 3.99 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు గాను కొన్ని నెలల క్రితం స్థానిక ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం సమీపంలోని మార్జిన్ లేదా రైతుల నుంచి భూములు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇక్కడ మాత్రం అటువంటి పనులు చేయకుండా చినగొల్లపాలెం బ్రాంచి చానల్ కాలువను పూడ్చేస్తూ రోడ్డును విస్తరిస్తున్నారని ఇది చాలా అన్యాయం అంటూ పలువురు రైతులు శనివారం పనులను నిలిపివేయాలంటూ నిరసనకు దిగారు.

ఇదెక్కడి అభివృద్ధి....

రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు సంబంధిత రోడ్డుకు అవసరమైన భూమిని సర్వే ద్వారా గుర్తించి అవసరమైతే భూమి కొనుగోలు చేసి పనులు చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం పాతరోడ్డును విస్తరిస్తూ పంట కాలువలోకి మట్టిని వేసి పూడ్చివేస్తూ నిర్మాణం చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో రైతులకు కావాల్సిన సాగునీరు అందకుండా పోతుంది.

పనులు నిలిపివేయాలి....

పంటకాలువను పూడవడం దారుణమని సర్వే చేయించి పంటకాలువ ఎక్కడ వరకు ఉంటుందో అక్కడ వరకు కాలువను వదిలేసి మిగిలిన భూమిలో రోడ్డు నిర్మాణం చేసుకోవాలని రైతులు యాళ్ల శ్యాంబాబు, యాళ్ల రాజబాబు, పడవల శ్రీరామకొండలరావు, పులగం అబ్బులు, ఆగిశెట్టి బాబ్జీలు ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మికి వివరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ సర్వే చేయించే వరకు పనులు నిలిపివేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

పంటకాలువ పూడ్చితే ఊరుకోం



నాలుగు వేల ఎకరాలకు పైగా భూములకు సాగు నీరందించే చానల్‌ను పూడ్చి రోడ్డు వేస్తామంటూ ఊరుకునేది లేదు. రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన భూమిని సర్వే చేయించి తీసుకోవాలి. ఆక్రమణకు గురైన పంటకాలువను సైతం విస్తరించాలి.

–యాళ్ల శ్యాంబాబు, రైతు, ప్రముఖ న్యాయవాది

ఇది చాలా దారుణం



రైతులకు ఉపయోగపడే పంట కాలువను పూడ్చి రోడ్డు వేస్తాననడం చాలా దారుణం. రోడ్డుకు అవసరమైన భూమి రైతుల నుంచి తీసుకోవాలి. లేదా ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి రోడ్డు కోసం వాడుకోవాలి. ఈ కాలువపై చాలా ఆక్రమణలు, ఇష్టానుసారంగా వ్యక్తిగత పైపులు ఉన్నాయి. దీనిపై యంత్రాంగం దృష్టి సారించాలి.

–పడవల శ్రీరామకొండలరావు, పోడు, రైతు

కాలువ పూడిపోతే మా గతేంటి



నేను ఈ కాలువపై శివారు ప్రాంత రైతును. కాలువ పూడిపోతే నా పొలానికి సాగునీందే మార్గం లేదు. కాలువ వెంబడి ఎంతో భూమి ఆక్రమణలకు గురైంది. దాన్ని గుర్తించి రోడ్డు వేసుకోవాలి అంతేకాని ఇలా కాలువ పూడ్చకూడదు.

– పులగం అబ్బులు, రైతు, లక్ష్మీపురం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

కోనేరుసెంటర్: యుక్త వయసు వచ్చిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం విశ్వవిద్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద, ధనిక అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ స్వరూపా, డాక్టర్ రవి, డాక్టర్ శేషిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పి.గోపి పాల్గొన్నారు.

పెడన: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు కూడా బాధ్యతగా ఓటు వేయడానికి ఆసక్తి చూపించి మన బాధ్యతను సక్రమంగా నెరవేర్చుకుందామని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గూడూరు రైలు గేటు వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల వద్ద మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దారు నరసింహరావు, హెచ్ఎం అద్దంకి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరు: జాతీయ ఓటరు దినోత్సవాన్ని గూడూరు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆకులమన్నాడులో సర్పంచ్ మొహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఎంపిటీసీ సభ్యుడు లక్ష్మణరావు, వీఆర్వో వరప్రసాద్, పాల్గొన్నారు. రాయవరంలోనూ నిర్వహించారు.

ఘంటసాల: ఓటు అనే వజ్రాయుధంతో సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల జడ్పీ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులచే ఎన్‌వీడీ అనే ఇంగ్లీషు అక్షరాలలో కూర్చుని మానవహారం ఏర్పాటు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డెప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గ, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య లక్ష్మీ, వీఆర్వోలు పాల్గొన్నారు. మండలంలోని 44 పోలింగ్ కేంద్రాలతో పాటు తెలుగురావుపాలెం, అచ్చెంపాలెం, ఘంటసాల కేవీకేలో జరిగిన ఓటర్ల దినోత్సవ క్యాక్రమాల్లో సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, గాజుల శ్రీనివాసరావు, వీఆర్వోలు, బీఎల్వోలు, సెక్రటరీలు పి.కోటేశ్వరరావు, కొడాలి శ్వేత, ఆర్.శ్రీనివాసరావు, కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



పెడనలో మానవహారం చేసి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

కోడూరు: జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నూతనంగా ఓట్లు మంజూరైన వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించి, ప్రతిజ్ఞ చేశారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రధాన రహదారుల వెంట విద్యార్థులు ఓటు విలువను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో మానవహార ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శ్రీనునాయక్, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు, డీటీ పద్మప్రియ, సుబాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు నగర ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఓటరుకు ఉన్న ఓటు హక్కు విలువను వివరించారు. పోర్టురోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పాఠకులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్, ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బి.విజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రామారావు, మైక్రో ఆర్టిస్టు గేదెల అప్పారావు, సంస్థ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్తివెన్ను: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నీలిపూడి గ్రామంలో ఓటుహక్కు కలిగిన సీనియర్ ఓటర్లను సత్కరించారు. కొత్తగా ఓటు పొందిన వారికి రాజ్యాంగంలో ఓటుహక్కు విలువను వివరించారు. అనంతరం విద్యార్థులకు జాతీయ ఓటరు దినోత్సవంపై వ్యాసరచనా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం కృష్ణ, రాము, సూర్యచంద్రరావు, నాగరాజు, కార్యదర్శి నిరీషా, వీఆర్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించాలి

మోపిదేవి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీవిద్య ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ, ప్రధాన సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఏడుగురు సీనియర్ సిటిజన్స్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి, జెడ్పీపాఠశాలలో తరగతుల వారీగా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు పెన్ను, ప్రసంశా పత్రాలు అందచేశారు.

బంటుమిల్లి: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో మండలంలోని బంటుమిల్లి కొమ్మారెడ్డి పాఠశాల విద్యార్థిని ఎస్. గీతికప్రియ ద్వితీయ బహుమతి సాధించింది. జూనియర్ విభాగంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన పోటీలందు బహుమతి సాధించడం పట్ల పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరస్పాండెంట్ శోభ, హెచ్ఎం శ్రీనివాసరావు అభినందించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఫోరం

కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు



వినియోదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఫోరం చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు తదితరులు

పెడన: సీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా మూడున్నర సంవత్సరాలు కిందట ఫోరం ఏర్పాటు చేశామని కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానీయేలు అన్నారు. పెడన సబ్ డివిజన్ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు సంబంధించి విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సును తోటమూల పెడన ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం చైర్మన్ మాట్లాడుతూ సీపీడీసీఎల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫోరం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వంద వరకు సదస్సులు నిర్వహించి 674 అర్జీలను పరిష్కరించామని చెప్పారు. ఈ ఫోరం ద్వారా విద్యుత్ మీటర్ల ఇబ్బందులు, బిల్లులు అధికంగా రావడం, విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటం, లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాలు దెబ్బ తినడం వంటి వాటి సమస్యలపై తక్షణం పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ గుణదలలోని ఫోరం కార్యాలయానికి ఆయా సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉందన్నారు. ఫోరం ఉందనే విషయాన్ని విద్యుత్ వినియోదారుల కోసం క్షేత్రస్థాయిలో సదస్సులు నిర్వహించి ఫోరం ఆవశ్యకతను తెలియజేస్తున్నట్లు వివరించారు. అలాగే ఫోరంను తప్పుదోవ పట్టించడానికి దొంగ ఫిర్యాదులు చేస్తే మాత్రం శాఖాపరంగానే కాకుండా చట్టపరంగా శిక్ష కూడా వేయడానికి ఫోరంకు ఉందన్నారు. నడుపూరు మండలం మెరికేపాలెంకు చెందిన పెదపూడి ఫకీర్ తన ఇంటికి విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందని, ఎస్సీ కేటగిరికి చెందిన తనకు రూ.1,200 బిల్లు రావడంపై ఫిర్యాదు చేశారు. బిల్లు కట్టని పక్షంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తానంటూ అధికారులన్నారంటూ తెలిపారు. తక్షణం ఆ సమస్య పరిష్కరించే వరకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయవద్దని చైర్మన్ ఆదేశించారు. ఫోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత, ట్రాన్స్‌కో ఉన్నతాధికారి సుధాకర్, మచిలీపట్నం డీఈ గోవిందరావు, పెడన ఏడీఈ సీహెచ్ఆర్ ఆర్ మాణిక్యలరావు, ఏఈ ఏడుకొండలు, పలు సబ్ డివిజన్లకు చెందిన విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి

–మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సూరిబాబు

మోపిదేవి: కేంద్ర ప్రభుత్వం అందించే సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సాయిబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలుశాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద తొలివిడతగా దేశంలో కోటి గృహాలకు సబ్సిడీ రూపంలో రూ.79 వేల కోట్లు అందిస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితం కాగా మిగిలిన సామాజిక వర్గాలకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రూపంలో సోలార్ ప్లేట్స్ అందిస్తుందని చెప్పారు. ఒక కిలో వాట్‌కు రూ. 30 వేలు, రెండు కిలో వాట్స్‌కు రూ. 60 వేలు, మూడు కిలో వాట్స్‌కు రూ. 78 వేలు చొప్పున సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. ఎంపీడీవో జె స్వర్ణభారతి, ఈవోపీఆర్డీ త్రిపుర సుందరి, విద్యుత్‌శాఖ మండల ఏఈ పాండురంగారావు, ఏపీఎం శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు, వీవోలు, జెఎల్ఎంలు పాల్గొన్నారు.

ఘంటసాల: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు వీఓఏలు, లైన్‌మెన్లు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్య ఘర్ యోజన గురించి విద్యుత్తు వినియోగదారులకు అవగాహన కల్పించి సోలార్ విద్యుత్తు పెట్టుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, విద్యుత్తుశాఖ ఏఈ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

తలగడదీవి(నాగాయలంక): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో కృష్ణా జిల్లా 84వ వార్షిక సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన అవనిగడ్డ సబ్ జోన్ బాలుర ఆటల పోటీలు శనివారం ఘనంగా ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అవనిగడ్డ శాశనసభ్యుడు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ సబ్‌జోన్ క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంఈఓలు టీవీఎస్ రామదాసు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, మాజీ సర్పంచ్ మెండు చంటి, స్కూలు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వర్రే రాంబాబు, హెచ్ఎం బండ్రెడ్డి శివరామప్రసాద్, సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ఫిజికల్ డైరెక్టర్స్, పీఈటీలు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌జోన్ క్రీడల ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నేడు పూర్వ విద్యార్థుల కలయిక రజతోత్సవం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పూర్వ విద్యార్థుల కలయిక రజతోత్సవ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ శిల్పకళా వేదికలో నిర్వహిస్తామని నిర్వాహకులు దొరరాజు, మద్దుల గిరీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 25 సంవత్సరాలుగా హైదరాబాద్ కేంద్రంగా మచిలీపట్నం పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమాన్ని ఏటా జనవరి 26వ తేదీన నిర్విరామంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 25 ఏళ్ల కార్యక్రమాన్ని రజతోత్సవంగా పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మచిలీపట్నంలోని పలు విద్యా సంస్థల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై వారి స్నేహితులను కుటుంబ సమేతంగా కలుసుకుని మధుర స్మృతులతో ఆనందంగా గడపాలని కోరారు. టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.3.10 లక్షల ప్రోత్సాహం అందిస్తామన్నారు.

సీపీఎం సీనియర్ నేత నారాయణ మృతి

కొడాలి(ఘంటసాల): సీపీఎం సీనియర్ నేత ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన తుమ్మల వెంకట నారాయణరావు అలియాస్ బడ్డీ నారాయణ (92) శనివారం ఆకస్మిక మరణం పొందారు. విషయం తెలుసుకున్న పలువరు నేతలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వెంకటనారాయణ కుమారుడు తుమ్మల వెంకట రమణయ్యను ఫోన్‌లో పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ పార్టీ సీపీఎం సీనియర్ నేత వాకా రామచంద్రరావు మాట్లాడుతూ తాడేపల్లి, కొడాలి గ్రామాల్లో పార్టీని పోషించిన మహానుభావుడు బడ్డీ నారాయణ, అయన సోదరి తాతినేని వెంకట నరసమ్మ అని, వారుపార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

ఆడిటోరియం ప్రారంభం

గూడూరు: మల్లవోలు జెడ్పీ హైస్కూలులో నిర్మించిన ఆడిటోరియంను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన దాత దాసరి సోమేశ్వరరావు తన సొంత నిధులతో దీనిని నిర్మించారు. శనివారం పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యే రిబ్బన్‌కట్ చేసి ఆడిటోరియం ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

■ 108 వాహనాల్లో ఖాళీల భర్తీకి 27న ఇంటర్వ్యూ

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని 108 వాహనాల్లో పలు ఖాళీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని జిల్లా మేనేజర్ హరీష్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), పైలెట్ (డ్రైవర్) పోస్టులకు అర్హత ఉన్న వారు ఈ నెల 27వ తేదీన జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, బయో కెమిస్ట్రీ, బీఎస్సీ, లైఫ్ సైన్సెస్, బీ-ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎల్‌టీ తదితర కోర్సులు చేసిన వారు ఈఎంటీ పోస్టుకు అర్హులని చెప్పారు. అలాగే 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీ లైసెన్స్, 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు, ఇంగ్లీష్ చదవడం, రాయడం తెలిసిన వారు పైలట్ పోస్టుకు అర్హులని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు మచిలీపట్నంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పక్కన ఉన్న నోబుల్ కాలేజీలో జరిగే ఇంటర్వ్యూకి ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటా, సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీతో హాజరుకావాలని సూచించారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7901240703, 8919197050, 7093123579 ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

■ పశు వైద్య శిబిరాలు

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మర్రిపాలెం సచివాలయం పరిధిలోని వక్కపట్లవారి పాలెం గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. అవనిగడ్డ పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బి.సాంబశివరావు, గ్రామ సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. సాయి మౌనిక నేతృత్వంలో 520 పశువులకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధుల చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు నిర్వహించారు. వీటిలో 150 జీవాలకు డీవార్మింగ్, 300 పశువులకు గురక వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు.

■ భక్తిగీతాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

అవనిగడ్డ: కోడూరు మండలం మాచవరంలో వేంచేసియున్న తుంగపల్లెమ్మతల్లి అమ్మవారిపై ఆలపించిన ప్రత్యేక భక్తి గీతాలను శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మాచవరంలో వెలిసిన తుంగపల్లెమ్మ తల్లి చాలా మహిమగల అమ్మవారు అన్నారు. డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ రచించిన ఈ గీతాలకు ఉపాధ్యాయుడు, గాయకుడు సూరగం రామకృష్ణ, నరహరిశెట్టి జ్యోతి, మణిప్రియ, బి శ్రీసుహిత భారతి గానం అందించారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు అందించిన రచయిత, గాయకులను ఎమ్మెల్యే అభినందించారు.

■ గిరిజన చిన్నారులను బడిబాట పట్టించిన ఉపాధ్యాయుడు



కోడూరు: పాఠశాలకు రాకుండా కృష్ణానదిపై వేటకు వెళ్తున్న ఎస్టీ పిల్లలను ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం బడిబాట పట్టించారు. పాఠశాలలో చదివే 15 మంది ఎస్టీ కుటుంబాలకు చెందిన చిన్నారులు కృష్ణానది కరకట్ట వెంట నివాసముంటున్నారు. చిన్నారులు తల్లిదండ్రులు నది వెంట పీతలు, రొయ్యలు పట్టుకుంటూ జీవనోపాధి పొందుతుండగా, పిల్లలు కూడా వీరిని అనుసరిస్తున్నారు. పిల్లలు తరచూ పాఠశాలకు గైర్హాజరవడంతో వీరి పట్ల పాఠశాల ఉపాధ్యాయులు నాగభూషణం ప్రత్యేక దృష్టి సారించాడు. శనివారం వీరు నివాసముంటున్న ప్రాంతానికి వెళ్లి వేటలో ఉన్న చిన్నారులను తిరిగి పాఠశాలలో చేర్చాడు. చదువు అవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. నాగభూషణం కృషిని ఎంఈఓల టి.వి. ఎం.రామదాసు, శ్రీనివాసరావు అభినందించారు.

■ హామీలను తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వం

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చి వాటిని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం ప్లేట్లు మోగించి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులు అబ్దుల్ మతీన్, ధనేకుల మురళీమోహనరావు, శొంఠి నాగరాజు, మొవ్వ మోహనరావు, శిష్లా దత్తుడు, కోక ఫణిభూషణ్, వెలిశల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

■ అగ్నిప్రమాద బాధితులకు మైత్రీ సాయం

మచిలీపట్నంటౌన్: నగర శివారులోని బందరుకోటలో ఇటీవల వాటాల శ్రీనివాసరావుకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. దీంతో శ్రీనివాసరావు కుటుంబం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలింది. ఇంట్లోని వంట సామగ్రి, బట్టలు, ఫర్నీచర్ కాలి బూడిదయ్యాయి. సాయం కోసం ఎదురుచూస్తున్న శ్రీనివాసరావుకు మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు వంట సామాగ్రి పాత్రలు, గ్యాస్ పొయ్యి తదితరాలు శనివారం అందజేశారు. రూ.10 వేల రూపాయలు విలువైన వీటిని అందించిన మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులకు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ సెక్రటరీ ధైవపు రాధాకృష్ణ, సభ్యులు రామకృష్ణ మాస్టారు, వక్కంటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

■ కలెక్టరేట్‌లో పాము కలకలం

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం పాము కలకలం సృష్టించింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఆరకువ్యాలీ కాఫీ షాప్ వద్ద ఉద్యోగులు టీ తాగేందుకు అక్కడకు వచ్చారు. ఆ సమయంలో డీఈవో కార్యాలయం వెనుక వైపు నుంచి భారీ పాము వేగంగా వచ్చింది. ఉద్యోగులవైపు వస్తుండటంతో అక్కడివారందరూ పరుగులు పెట్టారు. కేకలు వేయటంతో వెనుతిరిగి చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది.

■ తైపూసం కావడి సేవ కరపత్రం ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: నగరంలో ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్న తైపూసం కావడిసేవ నగరోత్సవ మహోత్సవ కార్యక్రమ కరపత్రాలను మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) శనివారం ఆవిష్కరించారు. కావడిసేవ నిర్వాహకులతో కలసి పేర్నినాని తన నివాసం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర వాసులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కావడిసేవ ప్రారంభిస్తారని చెప్పారు. 12వ తేదీ బుధవారం ఉదయం 7 గంటలకు రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మహా పాశుపతాస్త్ర హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు.